# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 16-10-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- దేశ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి కీలకమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు.

- భావితరం జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాలకు మేలు జరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్.. మనసులోని మాట" కార్యక్రమం 127వ సంచిక ఈ నెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

- ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రేపు రాష్ట్రంలో కొన్నిచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

====================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు రాష్ట్రంలో 13 వేల 429 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. కర్నూలు సమీపంలో జరిగిన బహిరంగ సభ నుండి ఆయన ఈ కార్యక్రమాలను వర్చువల్‌గా ప్రారంభించి, జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. దేశ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అవసరమని, అలాగే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి రాయలసీమ అభివృద్ధి కీలకమని వ్యాఖ్యానించారు. ప్రపంచ దేశాలు భారత్ ను 21వ శతాబ్దపు తయారీ కేంద్రంగా చూస్తున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉత్పత్తి కేంద్రంగా రూపుదిద్దుకుంటోందని, ఆత్మనిర్భర్ భారత్ లో రాష్ట్రం కీలకంగా మారిందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్... 36 సెకెన్లు)

పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి.. 9 వేల 449 కోట్ల రూపాయల విలువైన 5 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, ఒక వెయ్యి 704 కోట్ల రూపాయల విలువైన 8 అభివృద్ధి పనులను ప్రారంభించి, 2 వేల 276 కోట్ల రూపాయల విలువైన 2 ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. ప్రధానమంత్రి ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమాల్లో కొత్తవలస - విజయనగరం మధ్య 4వ రైల్వే లైన్, పెందుర్తి - సింహాచలం నార్త్ మధ్య రైల్ ఫ్లైఓవర్ లైన్, సబ్బవరం-షీలానగర్ మధ్య జాతీయ రహదారి

మొదలైనవి ఉన్నాయి. కొత్తవలస –కొరాపుట్ రైల్వే డబ్లింగ్ పనులను, శ్రీకాకుళం - అంగుల్ నాచురల్ గ్యాస్ పైప్‌లైన్ లను నరేంద్ర మోదీ జాతికి అంకితమిచ్చారు.

====================

భావితరం జీఎస్టీ సంస్కరణలతో నిత్యావసర వస్తువుల ధరలు తగ్గి, పేద, మధ్య తరగతి ప్రజలకు గొప్ప మేలు జరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటనలో భాగంగా కర్నూలులో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఒకేదేశం-ఒకే పన్ను- ఒకే మార్కెట్ విధానంతో తెచ్చిన జీఎస్టీ సంస్కరణలతో 99 శాతం వస్తువులు సున్నా, 5 శాతం శ్లాబ్ ల పరిధిలోకే వచ్చాయన్నారు. రైతులు, విద్యార్థులు, చిరువ్యాపారులతో సహా అన్ని వర్గాలకూ లబ్ది కలిగేలా సంస్కరణలు ఉన్నాయన్నారు. భావితరం జీఎస్టీ సంస్కరణలతో ప్రతీ కుటుంబానికీ ఏడాదికి 15 వేల రూపాయలు ఆదా అవుతోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమరావతి రాజధానిని నిలబెట్టామని, పోలవరం ప్రాజెక్టును గాడిలో పెట్టామని, విశాఖ ఉక్కును బలోపేతం చేశామని చెప్పారు. రాష్ట్రంలో విద్యుత్, రైల్వే, హైవే, రక్షణ రంగాలకు చెందిన 13 వేల 430 కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రధానమంత్రి ప్రారంభించారని ముఖ్యమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ బైట్... 36 సెకన్లు)

====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 127వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 24వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

====================

విరామం

====================

ప్యాలియేటివ్ కేర్‌కు సంబంధించిన పీజీ కోర్సును విశాఖలోని హోమీ బాబా కేన్సర్ ఆసుపత్రిలో ప్రారంభించేందుకు అనుమతి లభించింది. రాష్ట్రంలో తొలిసారిగా ఈ కోర్సును ప్రారంభించేందుకు వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అనుమతి మంజూరు చేశారు. నొప్పి ఉపశమన సంరక్షణలో అందుబాటులోకి వస్తున్న ఆధునిక సమగ్ర చికిత్సా విధానాలను పీజీ కోర్సు ద్వారా విస్తరించేందుకు ముందుకొచ్చిన హోమీ బాబా క్యాన్సర్ ఆసుపత్రి, చికిత్సా కేంద్ర నిర్వాహకులను మంత్రి అభినందించారు.

====================

యువత ప్రత్యేక లక్ష్యాలతో ముందుకు సాగాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు. సెట్విస్, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో ఈరోజు విశాఖలో జరిగిన యువజనోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. యువత నీతి, నిజాయితీలతో ఉంటూ మంచి పౌరులుగా నిలవాలని సూచించారు. జీవితంలో ఎదిగేందుకు

నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక ప్రత్యేక లక్ష్యం పెట్టుకొని, దానిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని చెప్పారు. చదువుతో పాటు కళలపై కూడా యువత దృష్టి సారించాలని, జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు శ్రమించాలని సూచించారు.

====================

గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ తరపున విస్తృత ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కమిషనర్ రాహుల్ మీనా అధికారులకు సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని అన్ని విభాగాల అధికారులతో ఈరోజు ఆయన సమీక్ష నిర్వహించి, పుష్కరాల ఏర్పాట్లు, ముందస్తు సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు. పుష్కరాలకు దాదాపు 21 నెలల వ్యవధి ఉన్నందున శాశ్వత మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై ఇప్పటి నుంచే దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా రహదారులు, డ్రైనేజీ, వీధిలైట్లు, త్రాగునీరు, శానిటేషన్, గ్రీనరీ వంటి అంశాలపై దృష్టి సారించాలన్నారు. రద్దీ నియంత్రణ కోసం ప్రతీ ఘాట్ వద్ద ఏఐ టెక్నాలజీతో స్మార్ట్ పోల్స్ ఏర్పాటు చేయాలని కమీషనర్ అధికారులకు సూచించారు.

====================

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పోషకాహారం ఎంతో ఆవశ్యకమని ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. పోషణ్ మాసోత్సవాల ముగింపు సందర్భంగా ఈరోజు ఒంగోలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అక్కడ ఏర్పాటు చేసిన పోషకాహార ప్రదర్శనను తిలకించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాలు పిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించే కేంద్రాలని, పిల్లలకు ఆటపాటలతో పాటు పోషకాహారాన్ని కూడా అందిస్తారని అన్నారు. నెల రోజుల పాటు పోషకాహార ఆవశ్యకత గురించి పలు కార్యక్రమాలను నిర్వహించి పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం జరిగిందన్నారు.

====================

ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో రేపు రాష్ట్రంలోని ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. దక్షిణ కోస్తా తీరం వెంబడి గంటకు 35 నుండి 55 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంటూ.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెట్లు, భారీ హోర్డింగ్స్ వద్ద నిలబడవద్దని హెచ్చరించింది.

====================

గన్నవరం నియోజకవర్గంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకటరావు అధికారులను ఆదేశించారు. గన్నవరం ఎంపీడీవో కార్యాలయంలో ఈరోజు ఆయన.. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తో కలసి.. అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో కొన్ని చోట్ల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, కలెక్టర్ వేసిన పర్యవేక్షణ కమిటీ, వాటిని పరిరక్షించాలని అన్నారు.

=====================

=====================